కథానిక

# మసిగిన్నె

మేడిచర్ల గోపాలకృష్ణమూర్తి

మధ్యాహ్నం రెండు గంటలయింది. మాధవి గారింటికి అలిసిపోయివచ్చాడు రవి. మధ్య వరండాలో ఎవరితోనో ఖులాసాగా కబుర్లు చెప్పుకుంటున్న రమ అతన్ని చూసింది. అతని ఒళ్లంతా చెమటతో నిండి ఉన్నది తలలోంచి కారుతున్న చెమట కళ్ళల్లో పడడంచేత కళ్లు మండి పోతున్నాయి. ఇష్టం వచ్చినట్లు నలిపేస్తున్నాడు. కాని చొక్కానిండా కూడా చెమటబాగా ఆవరించి ఉండటంచేత తుడిచినా ప్రయోజనం లేకపోతోంది. శరీరం మీద సన్నగా పాయలల్లే జారుతుంటే తేళ్లు, జెర్రులు పాకుతున్నట్లనిపిస్తోంది. ఎక్కడ నుంచైనా కొంచెం చల్లగాలి వస్తే చాలు కొంతవరకు ఆత్మ శాంతిస్తుంది కాని అచుట్టుపక్కల విసనకర్ర కూడా కనుపించలేదు. దప్పిక ఎక్కువ అవడంచేత నోరు పిడచ కట్టుకు పోతోంది. మాట్లాడే శక్తికూడాపోయింది. ఎదురుగుండా చూస్తున్న రమ ఇతని స్థితిని సరిగా గమనించనట్లు తోస్తుంది. వంట ఇంటిలో అప్పడాలు ఒత్తుకుంటున్న తల్లితో "అమ్మా! రవన్నయ్య వచ్చాడు"అని మాత్రం చెప్పి ఊరుకుంది.

మాధవి బైటికి వచ్చి, "ఎక్కడనుంచి వస్తున్నావురా?"అని అంటూ రమ వంక చూసింది. ఆమె ముఖం కొంచెం ఎర్రబారింది.

"ఎండలో అలిసిపోయి వాడొస్తే, కాళ్లు కడుక్కోడానికి నీళ్ళిచ్చి మంచినీళ్ళివ్వకుండా దర్జాగా కూచుని కబుర్లు చెప్తున్నా. నీ కెలా తోస్తోందంట. లేచిముందు మంచినీళ్ళివ్వు" అని కోపంగాఅన్నది. రమ ముఖం మాడ్చుకున్నది.

రవి చొక్కా విప్పి తుండుగుడ్డ బుజాన వేసుకొన్నాడు "పిన్నీ! ఎందుకు దాన్ని లేపడం, నేను దొడ్లోకిపోయి కాళ్ళూ చేతులు కడుక్కుంటాను"అంటూ దొడ్లోకి వెళ్ళాడు.

మాధవి రమను కోపంగా చూస్తూ దొడ్లోకి వచ్చింది.

"ఒరే! ఇంటిదగ్గిర అంతా కులాసానేనా?"

"కులాసానే"

"ఇంత ఎండలో బయల్దేరి వచ్చావేం?"

మంచినీళ్లు తాగుతూ "ఏదో, చూసిపోదామని బుద్ధి పుట్టి వచ్చాను" అన్నాడు.

"అన్నం తిన్నావా?"

"ఆఁ"

"కాసేపు విశ్రాంతిగా ఆ వసారాలో పడుకో బడలిక తీరుతుంది" అని ఆమె మళ్ళీ అప్పడాలు వత్తుకునే పనిలో నిమగ్నురాలు కాబోయింది. రవి ఏవో సంగతులు చెపుతూనే ఉన్నాడు. ఆమె "నువ్వు పడుకోరా! తరువాత చెప్దువుగాని"అని కొంచెం అయిష్టతను సూచిస్తూ అన్నది. అతను ఏమీ మాట్లాడలేదు. ఆమె మళ్ళీ కొంచెంసేపు అయింతరువాత రమను పిలిచింది.

"ఎందుకమ్మా పిలిచావ"ంటూ రమవచ్చింది.

"వాడు ఎంత సేపయిందో భోజనంచేసి, కాస్త కాఫీ కాచివ్వు."

రమ కొంచెం ప్రశ్నార్థకంగా చూచింది.

"ఎందుకే అలా చూస్తావు, ఆ అంటగిన్నె తోమి నిప్పు రాజేసి నీళ్లుపెట్టక."

ఆపని చేయమనడం ఆమెకెంతో అవమాన పరిచినట్లుగా ఉన్నది. కాని చేయకపోతే చెడబడా తిడుతుంది. ఏంచేయాలో తోచక నిలబడిపోయింది.

"ఏం? నుంచుంటావేం?"

"ఇంకాసేపుంటే పని చేసేది వస్తుందిగా" అని కొంచెం బెరుకుబెరుకుగా అన్నది.

మాధవికెంతో కోపం వచ్చింది. "పనిచేసేది ఇంకాసేపుంటే వస్తుందన్న సంగతి నాకు తెలియకపోలేదు. అసలు నేనే చేసుకునే దాన్ని. మడికట్టుక చచ్చాను గదాని నీతో చెప్పాను కాస్తంత గిన్నె తోమితే నీ పరువంతా పోతుందా! ఆడదానివి కాదూ! రేపు

అత్తారింటికి వెడితే ఏంచేస్తావు?" అంటుంటే రమ మూతి ముడుచుకుని అవతలకి వెడుతోంది.

"ఒరే చూశావుట్రా ఎలా వెడుతోందో! అసలీ చదువులు వచ్చినయ్, అన్నింటికీ అనర్థకం. ఇది చదవడం మొదలెట్టిం దగ్గిరనుంచీ దానికొక్కడా చాకిరీ చేయలేక నా ప్రాణం కుంగిపోతోంది. ఏపని చేయబోయినా అభిమానమే నాయను. ఎట్లా చచ్చేది. సరే ఏంచేస్తా. నా ఖర్మ. నేనే మడి విడిచి తోముతాను" అని లేవబోతోంది మాధవి.

రవి చాలా బాధపడ్డాడు. "నేనెందుకు రావాలి? నాకెందుకు సమయాసమయ వివేక జ్ఞానం లేకపోవాలి? ఆమెకీ చీవాట్లన్నీ నామూలంగానే కదా? ఇప్పుడామె మడి విడిచి ఆ అంటగిన్నెను తోమితే తరువాత మళ్ళీ స్నానం చేయాలి. లేకపోతే మడికి పనికి రాదు. రమకు తన స్నేహితురాలుండగా తాను ఈ పనిని చేస్తే చులకనై పోతానేమో నన్న బాధేగాని మరోబాధ లేదు. ఆమెనెన్ని తిడితే మాత్రం ఏం ప్రయోజనం? నేను కాఫీ తాగను అని చెప్తే ఎవరికీ ఏబాధా ఉండదుగా! కాని ఇంత కొండ జరిగిన తరువాత వద్దంటే మాత్రం ఏం మర్యాద. మొదట్లోనే చెప్తే చాలా మర్యాదగా ఉండేది." అని ఎంతో ఆందోళన చెందాడు.

"ఎదురు పిన్నీ దాని సంగతి తెలిసుండి కూడా అట్లా తిడతావు? వాకిట్లో ఆమె స్నేహితురాలు కూడా ఉన్నది" అని జాలిగా అన్నాడు.

"ఏం ఉంటే? ఆ అమ్మాయికి మాత్రం తెలియదా?"

రవికి కొంచెం ఒళ్లు మండింది. ఒండొరుల మనస్తత్వాన్ని సరిగా అర్థం చేసుకోకుండా గుడ్డిగా ప్రవర్తిస్తారు గనుకనే ఇట్లా వస్తాయి అనుకున్నాడు తరువాత మాధవివంక చూస్తూ అంటగిన్నెను తీసుకు దొడ్లోకి వెళ్ళాడు.

మాధవి తెల్లబోయింది. "అదేమిట్రా నువ్వు తోముతున్నావు? ఛీ! నేను తోముతానుండు నీకేం చేతవుతుంది."

"ఎందుకు పిన్నీ! నేను పరాయివాణ్ణయితేగా! ఈమాత్రం దీనికి నువ్వు మడి విడవడం దేనికి." అని చిరునవ్వు నవ్వుతూ అన్నాడు.

మాధవి మనస్సులో కుమిలిపోతూ చేయగలిగింది లేక బలహీనమైన చేతులతో అప్పడాలను ఒత్తుతోంది. రమ తన స్నేహితురాలినిపంపి దొడ్డిలోకి వచ్చింది. మసిగిన్నె తోముతూఉన్న రవి కనుపించాడు. అతని ముఖాన్ని చూస్తుంటే నే ఆ పనిలోని ప్రశాంతతకనుపిస్తోంది. అతను అనాగరికుడు కాడ. బాగా చదువుకున్న వ్యక్తి కూడా. అపని చేయడంలో అతనిలో ఏవిధమైన హెచ్చు తగ్గులుగాని, లోకం ఏదైనా అంటుందేమోనన్న సిగ్గుగాని ఏమీ కనుపించడం లేదు. అదతని యోగ్యతా విషయం

ఆమె కాపని చేయడమంటే తలనొప్పి. తాను నాగరికురాలు, విద్యావంతురాలు. ఆ పని కేవలము అనాగరికులు తిండి గుడ్డలకు మొహం వాచినవారు చేయతగినది తాను చేస్తే తన గౌరవ ప్రతిష్ఠలకు భంగము వస్తుందని భయపడుతుంది. లోకాన్ని చూచి వెరుస్తుంది. నిజంగా లోకంకూడా సానుభూతి చూపలేదు. "చదువుకున్నది కూడా అంట్లు తోముతోంది" అని నవ్వుతుంది. దాంతో కృంగిపోతుంది. ఆమెకు తన స్థితిని తాను జాగ్రత్తగా చక్కపెట్టుకునే శక్తిలేదు. అది కేవలము గర్వము. అభిమానము తాను చేసుకో గలిగిన పనులలోకూడా ఇతరుల ఆసరాకోసం ప్రయత్నిస్తుంది కాని వారికి సరియైన కృతజ్ఞత ను చూపలేదు. అది ఆమె కక్కరలేదు. తన ఒళ్లు చెమటపట్టకుండా చీర చెంగు నలగకుండా జాగ్రత్తగా ఉండడమే. అదే ఆమెకు కావలసింది. దాంతో ఆమె తన స్థితిని తాను ఎంతో పోషించుకో గలుగుతున్నానని సంతృప్తి పడుతుంది.

ఆమె అతన్ని చూస్తున్న కొద్దీ కళ్లు చెమ్మగిలుతున్నాయి. ఆమె హృదయాన్ని చలింపచేసే సుడిగాలి ఏదో ఆమెచుట్టూ ప్రళయంగా తిరుగుతోంది. హృదయం బలహీనమవుతున్న కొద్దీ గుణశూన్యమయి శుద్ధ వస్తువుగా అవుతోంది. ఇప్పు డతనకీ తనకీఉండే అంతరం తెలుస్తోంది.

ఆమె హృదయం ఎంతో ఆవేదనాపీడిత మవుతోంది. అంతులేని హిమశిఖరము నెత్తిన

పడినట్లే అయింది. సిగ్గుతో ముడుచుకుపోయిన ఆమె తల్లిని చూచింది. ఆమె ముఖమే ఆమె హృదయంలోని ఆందోళన చెప్తోంది. దానికి కారణం తాను. తన మూలంగానే ఆ పాపిని హృదయవేదనతో కృంగి కృశించిపోతోంది. తన స్నేహితురాలిఎదుట తాను అంట్లు తోమితే తనగౌరవానికి భంగంఏర్పడుతుందనేభయంతో ఇంటికి వచ్చిన అతిథికి ఏవిధంగానూ సపర్య చేయలేకపోయింది. చివరికి అంటునుకూడా తోమేట్టు చేసింది. అతనెంత మంచివాడు. అతను తన తల్లి స్థితిని తన స్థితి ని సరిగా అర్థం చేసుకుని ప్రవర్తించాడు. తాను మూర్ఖురాలు. కేవలం మెరుపు దీవెలనుచూసి మురిసిపోవడమే తెలుసు. కాని మనుష్యుల స్థితిగతులను తెలుసుకునే జ్ఞానం లేదు. తన స్నేహితురాలి ముందు తనకు చాకిరీ చేయడం ఇష్టంలేకపోతే ఆమె నెందుకు వెళ్ళమనక పోవాలి? వెళ్ళమంటే ఆమె ఎందుకు వెళ్ళదు? వెళ్లమని చెప్పనే లేకపోయింది, పోనీ ఆమె ఉంటే మాత్రం తన ఇంటిపనులను తాను చేసుకుంటే ఆమె ఎందుకు నవ్వుతుంది? పోనీ నవ్వుతుంది, తాను చేసిన పనిలో తప్పు లేనప్పుడు ఆమె నవ్వినంత మాత్రాన తానెందుకు సిగ్గుపడాలి? దానికి కారణం కేవలము తనలోని అసమర్థత అవివేకం

ఆమె కళ్ళనుండి అశ్రువులు కారాయి. తన తల్లినిగాని రవినిగాని చూడలేకపోతోంది. తనలోని జీవశక్తంతా నిర్జీవమైపోయి, కదలలేని స్థితిలో ఉండిపోయింది. ఒక్కసారి తాను చేసిన తప్పుకు క్షమార్పణను కోరాలని మనస్సు ఎంతో పీకులాడుతూ ఉన్నది. నోరు పెగలడం లేదు నోటిలో ద్రవంలేదు. ఎవ్వరికీ కనిపించకుండా చీకటి మరుగున దాగిపోదామనిపించింది. తాను దాగకలదు, కాని తన హృదయం మాత్రం దాగలేదు. ప్రతి క్షణం తన్ను వేధిస్తూనే ఉంటుంది.

ఆమె కేమీ తెలియడం లేదు. తెలియడానికి మాత్రం ఏమున్నది. అంతా అగ్యమ గోచరం. తనలో వీస్తున్న సుడిగాలి మోతకు విశ్రాంతే లేనప్పుడు ఇతికర్తవ్యతా జ్ఞానం మాత్రం ఏమూలనుండి వస్తుంది? తనలోని అసమర్థత ఎక్కువవుతున్న కొద్దీ ఏడుపు కూడా వస్తోంది. ఎంతో ప్రయత్నించింది, ఆగడంలేదు. పాపం! పిచ్చిపిల్ల. ఎంత అయోమయకురాలు! తన నీడకో బెదిరిస్తున్నట్లు బెదిరి కూడా పోతోంది. కాళ్లు వణికి పోతున్నాయి. ఏమిటో తెలియదు. ఎందుకో తెలియదు. ఎక్కడికో కూడా తెలియదు. ఆమె పాదాలు ముందుకు పరుగెత్తినాయి. ఆమె తల్లి బలహీనమైన చేతులతో మెల్ల మెల్లగా అప్పడాలను ఒత్తుతూనే వున్నది. ఆమె పాదాలను గట్టిగా పట్టుకుంది. మాధవి పాదాల నిండా వెచ్చటి కన్నీళ్ళు. ఈ స్థితి ఆమె కెందుకు కలిగిందో మాధవికి అర్థం కాలేదు. కాని ఆమె బలహీనమైన హృదయాని కేదో మహత్తరమైన శక్తి వచ్చినట్లనిపించింది. తను ఒణికిపోతూ "అమ్మా!" అని మాత్రం అనగలిగింది. మాధవి కామె ఆవేదన అర్థమయింది. ఆమె అమాయక హృదయానికి యెంతో జాలిపడ్డది. ఆమెమీద తనకు పెనవేసుకున్న కోపం అంతా ఒక్కసారిగా పోయింది. కళ్ళనుండి ఆనందాశ్రువులు కారాయి. ఆ శీతల బిందు స్పర్శతో తను కొంచెం తేరుకుంది. తల్లివంక అమాయకంగా చూచింది. ఈసారి చాలా సేపే చూడగలిగింది

"అమ్మా! క్షమించవూ!" అని తెలియని అమాయకత్వంతో అన్నది.

మాధవి ఒళ్లు జలదరించింది. తెలియని ఆనందంతో ఒక్కసారి గట్టిగా కౌగలించుకున్నది.

రవి గిన్నెను తెల్లగా తోమి తీసుకు వచ్చాడు. వాళ్ళ ముఖంలోని అరుణ కాంతులే వారి హృదయాల్ని చెపుతున్నాయి. రమ మాత్రం రవిని ప్రశాంతంగా చూడలేక సిగ్గుతో తలవంచుకున్నది. అతని కంతా అర్థం అయింది. చిరునవ్వు నవ్వుతూ "పిన్నీ! గిన్నెకు మసేమీ లేనట్లేనా? కుంప ఎక్కడుందో చెప్పు, నిప్పు రాజేసి నీళ్లు పెడతాను" అన్నాడు.

రమ ప్రక్కకు తిరిగి "నేను రాజేస్తాలే" అని లేతగా అన్నది.